# అవినీతి పనులు!

అవసరాల రామకృష్ణారావు




సుశీలగారింటికి వెళ్ళి అడిగాను, 'శ్రీనివాసరావుగాని వచ్చాడా' అని.

'వస్తేమాత్రం, మా యింట్లో దిగాలని ఎక్కడుంది బాబూ! యిక్కడ వాడికి కావలసిన సదుపాయం జరగదుగా!'

అంది ఆవిడ నిష్ఠూరంగా. ఆ సదుపాయం అన్నమాట ఆవిడ ఒత్తి పలుకుతే, అందులో నాకు మరో అర్థం గోచరించింది. ప్రతి లాడ్జింగు హోమ్‌మీదా 'ఇక్కడ అన్ని రకముల సదుపాయములు లభించబడును' అనేబోర్డు ఉంటోందే; అది గుర్తుకు వచ్చింది.

సుశీలభర్త మంచి పలుకుబడిగల పోలీసు ఆఫీసరు. వాళ్ళకి క్వార్టర్సు యిచ్చారు. మేడమీద దక్షిణంవైపున ఒకటే రకమైన గెస్ట్‌రూంకూడా ఉంది. నేను మొదట్లో యిల్లు దొరకనప్పుడు ఒక వారంరోజులు ఆ గదిలోనే ఉన్నాను. మేడమీదే యిరవై నాలుగుగంటలూ వచ్చే కొళాయి ఉంది. బాత్‌రూం ఉంది. ఇంట్లో ప్రతినిముషం కనిపెట్టుకు ఉండే నౌఖర్లు – ఇవన్నీ కాక శ్రీనివాసరావుకి నెత్తిమీద పెట్టుకునే సుశీల ఉంది. ఇక్కడకాక మరొకచోట అతనికి సదుపాయం జరగడం అర్థంలేని మాట. అసందర్భం మాట.

'అస లింకా ఊర్నించి రాలేదేమోనండీ.'

'వచ్చాడు బాబూ, రాకపోవడమేమిటీ! ఆయన కారులో వెడుతూంటే రోడ్డుమీద కనిపించాడట. ఆయన విష్ చేస్తే అటు వైపైనా చూడలేదుట. ఇంటి కొచ్చి చాలా విసుక్కున్నారు.'

'అటువంటి మనిషి కాదే! ఎవరితోనో కబుర్లు చెబుతూ ఏదైనా హడావిడిలో ఉండిపోయాడేమో!'

'నిజమే మరి... హడావిడి కాదూ?' అంది మళ్ళీ ఆవిడ హేళనగా.

సుశీలకి శ్రీనివాసరావు ఆవిడ ఆరాటపడవలసినంత దగ్గిర సంబంధీకుడేం కాదు. చుట్టూ తిరిగి చెప్పుకుంటే ఆవిడ అతనికి అక్క అవుతుందట, చెప్పుకోడానికి పాపం సుశీలకి పుట్టింటితరఫువాళ్ళెవరూ లేరు మరి! అందుకే యితన్ని పట్టుకుని పాకులాడుతుంది.

'మీ అక్కగారు అంతగా అభిమానించినప్పుడు అక్కడే దిగకూడదటోయ్' అని అడిగాను ఒకసారి.

'నేను కోరే ఫ్రీడం నాకక్కడ దొరకదు మూర్తీ... వాళ్ళిద్దరికే ఒకళ్ళని మించిన చాదస్తం మరొకరికి. ఓ సిగరెట్ కాల్చుకోనియ్యరు, ఓ సెకండ్‌షో సినిమాకి వెళ్ళనియ్యరు, నలుగురు ఫ్రెడ్స్‌ని తీసుకొచ్చి గోల చేసుకోనివ్వరు. నా కెందుకొచ్చినబాధ అది?'

శ్రీనివాసరావు మా పట్నానికి పదిమైళ్ళ దూరంలో ఉన్న పల్లెటూళ్ళో మేష్టరీ వెలిగిస్తున్నాడు. 'ఏమీ తోచక వెర్రెత్తిపోయినపుడు' అతను యిక్కడికి వస్తూఉంటాడు, 'కాస్త గాలి పీల్చుకోవటానికి'ట.

'మా అక్కగారి ఆతిథ్యమూ వద్దు, అందులోని సాధక బాధకాలూ నాకు వద్దు. ఇంతకీ నే నెప్పుడు వచ్చినా మా భాస్కరం ఉన్నాడుగా!'

శ్రీనివాసరావు ఒకనాటి క్లాసుమేటు భాస్కరరావు. సింధియాలో వర్క్ చేస్తున్నాడు. రీడింగురూం పక్క సందులో ఒక పెద్దగది ఏభై రూపాయిలకి అద్దెకు తీసుకున్నాడు.

'ఆ భాస్కరం కంపెనీ అంత మంచిది

కాదుట ?' అని అడిగేశాను, ఉండబట్టలేక.

'వినడమేగాని భాస్కరం కంపెనీ ఏమిటో నాకూ తెలీదు. ఈసారి చూడాలి' అంటూ అతను తక్కున నవ్వేడు. ఆ నవ్వులో కావలసినంత మిస్చీఫ్ దాగిఉంది; అనుమానం ఏమీ లేదు.

'వాడికి పగలంతా ఉద్యోగంతోనే సరిపోతుంది. రాత్రుళ్లు సాధారణంగా యింటిపట్టున ఉండడు. ఇంక వాడికి రూం అనేది ఉందంటే అది కేవలం నాలాంటి వచ్చేపోయే వాళ్ళకోసమే !'

'బాగానే ఉంది వరస. నెత్తిమీద పెట్టుకునే అక్కయింట్లో దిగకపోవడమే కాకుండా, యిలాంటి జులాయిమనిషి యింట్లో బసచేసి అతన్ని నువ్వు వెనకేసుకురావడం మరీ విచిత్రం.'

'మనుష్యుల ప్రవర్తన యిలా ఉండితీరాలని జనరలైజ్ చేసిపారెయ్యడం నాకేం నచ్చదు.'

'అయితే ఇంక లోకంలో నీతీ అవినీతీ అన్నవి లేవంటావా ?'

'ఒకరివిషయంలో నీతి ఇంకొకరికి అవినీతిలా కనబడవచ్చు. ఎదుటివారికి హాని కలిగించనిది ఏదైనాసరే అనాగరికమూ, అసభ్యమూ అని నే ననుకోను. పైగా మనం యివ్వగల ఆనందం యింకొకరికివ్వొచ్చు. అవసరమని తోస్తే అందుకోవచ్చు.'

శ్రీనివాసరావు ఏం మాట్లాడినా అందులో రెండు అర్థాలు ఉన్నాయేమో అనిపిస్తుంది నాకు. అతని కబుర్లకీ, ప్రవర్తనకీ, ఆలోచనలకీ కేంద్రం సెక్సు ఒక్కటే అనేధ్వని నాకు స్పష్టంగా గోచరిస్తూ ఉంటుంది. ఎప్పుడో అతను మా తమ్ముడితో చదువుకోడమేమిటి, అతను యీఊరు వచ్చినప్పుడల్లా కలుసుకుందామని నే నంత తహతహ లాడవలసిన అవసరం ఏమిటి ! ఇంత వయస్సు వచ్చినా విషయ విషయాలమీద నాకు మోజు చావలేదాయేం ? ఆఁ, నాదేమంత పెద్దవయసుగాని, ఇలాంటిశృంగార సంబంధమైన కబుర్లు పట్టుకుని సాగదియ్యడానికి నే నింకా అంత దిగజారిపోలేదుమరి !

'అయితే భాస్కరం రాత్రుళ్ళు యింటిపట్టున ఉండకపోవడంలో ఏమాత్రమూ తప్పు లేదంటావు ?'

'నేనలా అనలేదే ! ఆర్జించుకుంటున్నాడు. అనుభవిస్తున్నాడు ... అతన్ని గురించి తక్కువగా అంచనా వెయ్యడానికి మన కేం అధికార ముంది ?'

'మనిషన్నవాడికి వయసుకి తగినబాధ్యత ఉండవంటావా ? డబ్బు సంపాదించడం కేవలం యిలా దుర్వినియోగం చేసుకోడానికేనా ? చదువుకుంటున్న తమ్ముళ్ళే ఉన్నారో, పెళ్ళికెదిగిన చెల్లెళ్ళే ఉన్నారో, పాపం ఆ తల్లీ తండ్రీ యితన్నుంచి దమ్మిడీ రాక ఎంత తల్లడిల్లిపోతున్నారో !'

'ఏం, నీతో చెప్పేరా ?' అని అడిగేడు శ్రీనివాసరావు నవ్వుతూ.

'ఏం చెబితే చెప్పకూడదా ?' అన్నాను ఒళ్ళు మండి.

'తన తల్లితండ్రు లెలావుంటారో భాస్కరమే ఎరగడు. అంతచిన్నప్పుడు పోయారు వాళ్ళు.' తెల్లబోయాను నేను.

'అతని కెవరూ నా అన్నవాళ్ళులేరు. చిన్నప్పట్నుంచీ నానాకష్టాలూపడి యింతవాడయాడు. ఇప్పు డిం కేం బాధలేదులే. ఈ మధ్య ఎవరిదో ఆస్తికూడా కలిసిందన్నారు.'

'అలాంటప్పుడు నచ్చినదాన్ని చూసి పెళ్ళి చేసుకోరాదూ ?'

'ఒకరిడబ్బు ఎంత ధారాళంగా ఖర్చుపెడతామో, ఒకరిగురించి ఊహాగానాలు చెయ్యడానికికూడా అంతకాలమూ ఖర్చుపెడతాము. వాడిగురించి మన కెందుకు చెప్పు ? పెళ్ళి కాకపోయినంతమాత్రాన బ్రహ్మచర్యం పాటించాలనే నియమంమీద కొందరికి నమ్మకము లేకపోవచ్చు.'

అని శ్రీనివాసరావు నా కళ్ళల్లోకి చూస్తూ చిలిపిగా నవ్వేడు. పెళ్ళి అయినంతమాత్రాన ఒకతెనే అంటిపెట్టుకుని ఉండాలనే నియమంమీదకూడా కొందరికి నమ్మకము లేకపోవచ్చు – అనిపించింది ఆ నవ్వులోని అర్థం నాకు. చెడిపోయాడని తెలిసుండి ఆ భాస్కరంగాడిని అంతలా వెనకేసుకొస్తున్నాడు. వచ్చినప్పుడల్లా వాడి గదిలోనే దిగుతున్నాడు – ఇతనుమాత్రం చెడిపోలేదని నమ్మకం ఏమిటి ? ఈ సంగతి తోచి నాకు శ్రీనివాసరావంటే పరమాసహ్యం కలిగింది. కాని అతని అంతు చూడనిదే అతనితో తెగతెంపులు చేసుకోడం నాకు యిష్టం లేకపోయింది. అయితే అతని దుష్ప్రవర్తన అంత త్వరలో కళ్ళపడుతుందని మాత్రం నేను కల్లో అనుకోలేదు.

* * *

ఎవరో స్టూడెంట్ చేత మెట్రిక్ కి కట్టిస్తున్నాననీ, అవతలి వ్యక్తి దగ్గిరుండి చదివించవలసినంత కావలసిన మనిషి అనీ వారంరోజులు శలవుపెట్టి మీవూరు వస్తున్నాననీ శ్రీనివాసరావు ఒకరిచేత కబురుపంపించాడు. అతన్ని కలుసుకుందామని ఆరాత్రి భాస్కరం రూముకి వెళ్ళేను. దూరంనుంచే చూశాను. మేడమీది గదిలో లైటు వెలుగుతోంది. పోనీ యింతదూరం వచ్చింది ఊరికే పోలేదు అనిపించింది. మేడమీదకి వెళ్ళేను. ఒకతలుపు తీసేఉంది.

'రావోయ్ మూర్తీ, ఎక్కడా దర్శనమే లేదు' అన్నాడు శ్రీనివాసరావు నన్నుచూచి. నేలమీద పరచిఉన్న హోల్డాలమీద పడుకుని అతనేవో యింగ్లీషునవల చదువుకుంటున్నాడు. దూరంగా గోడకి ఆనుకుని వేసిఉన్న పెద్ద డెమంచంమీద ఎవరో పూర్తిగా ముసుగుతన్ని అటుగా పడుకుని ఉన్నారు.

'ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను, మీ భాస్కరరావుని చూద్దామని. ఇన్నాళ్ళకి కుదిరిందన్నమాట' అన్నాను పక్కనున్న కుర్చీమీద కూచుని.

'ఇవ్వాళ కుదరదు' అన్నాడు అతను తల అడ్డంగా తిప్పుతూ.

'ఏం యిప్పట్లో లేవడా ?'

'లేవడంకాదు. ఇప్పట్లో అతను రావడం కుదరదు. కంపెనీపనిమీద బొంబాయి

వెళ్ళేడు. రెండువారా లయితేగాని రాడు.'

'అయితే ఆ పక్కమీద ఎవరుమరీ? ఓహో, ఎవరో మెట్రిక్ స్టూడెంటు అన్నావు కదూ, అతనేనా? పొద్దున్న పరీక్ష పెట్టుకుని యిప్పుడే 'రెండో రూము' ఏమిటి? ఇందుకేనా అంతదూరంనుంచి నువ్వతన్ని పిలిపిస్త?'

'ఇంతసేపూ చదివి ఇప్పుడిప్పుడే నిద్రకి ఉపక్రమించడం జరిగింది.' అంటూ శ్రీనివాసరావు నవ్వేడు. అనవసరంగా అలా నవ్వుతేనే ఎవరికైనా ఒళ్ళు మండేది. ఎందుకలా నవ్వుతావ్ అని అడుగుతే మరింత నవ్వుతాడు. ఎలా యిలాంటి వాళ్ళతో?

'నే వెడతా. మళ్ళీ ఉదయం వస్తా' అని లేవబోతే చెయ్యిపట్టుకుని కూచోబెట్టేశాడు శ్రీనివాసరావు.

'మరి స్టూడెంటు ఎవడో, ఎన్నేళ్ళవాడో చూసి మరీ వెళ్ళవూ?'

'దాని కేముంది పెద్ద; ఏ పద్ధెనిమిదేళ్ళ వాడో అయివుండొచ్చు.'

'వయస్సు రైటే, కాని...'

'కాని?'

'వెళ్ళి ముసుగు తీసి చూడరాదూ?'

మంచం దగ్గరగా వెళ్ళేను. నిజంగా ఆ కప్పుకున్న దుప్పటీ తొలగించి, ఆవ్యక్తిని స్పృశించి అపవిత్రం అయ్యేవాణ్ణే. కాని, ఏనాడో నేను చేసుకున్న పుణ్యం యింకా కొంచెం మిగిలివుంది అనుకుంటాను, ఆవ్యక్తి బద్ధకంగా ఒకవైపు తిరిగి, ఒకకాలు యివతలికి జాపడం జరిగింది. ఆకాలితో కొంచెం దుప్పటీ రెండవవైపు యివతలికి తోసుకొచ్చినవి ఏమిటి? పేంటుఫోల్డింగ్సూ కావు, పంచె అంచులూకావు, అవి చీర కుచ్చెళ్ళ చివరలు! నే నింకా తేరుకోకుండానే, ఆ వ్యక్తి ఆవలించి లేచికూచుని, నా మైకం పూర్తిగా వదలగొట్టింది.

'అబ్బ, ఎక్కడికో పోయిందండీ ప్రాణం మాష్టారూ.'

ఇంత మధురమైన కంఠం నే నెక్కడా వినలేదు. ఇంత అందమైన విగ్రహం నాకెక్కడా జతపడలేదు. ఇంతగా ఆడామొగా తెగించగలరని యిదివరకు నేను అనుకోలేదు. ఇంత చిత్రమైన పరిస్థితుల్లో నేను యిరుక్కోవడం యిదివర కెప్పుడూ జరగలేదు. ఇన్ని తెలిసినా నే నామె శరీరం వైపు గుచ్చి గుచ్చి పిచ్చెత్తినట్టు చూడడం మానలేదు!

'వీరు?' అంటూ ప్రశ్నార్థకంగా చూసింది ఆమె నావైపు. శ్రీనివాసరావు నన్నామెకు పరిచయం చేసి, ఆమెగురించి నా కిలా చెప్పేడు:

'ఈమె మెట్రిక్ విద్యార్థి కాదు విద్యార్థిని. పేరు లీలాసుందరి, ఊరు బెజవాడ. శ్రీవారు రాఘవరావుగారు, సిమెంటు ఫ్యాక్టరీలో ఇంజనీరుగా ఉంటున్నారు. చాలా లీలా?'

'చాలు, చాలు. మీ లీలలు, చెప్పుకుంటే సిగ్గుచేటు' అనుకున్నాను నేను. ఇంట్లోవాళ్లు కిందివాటాలో మేడమెట్లదగ్గిర కుక్కని మాత్రం కాపలా కట్టి — సకుటుంబంగా సినిమాకు వెళ్ళేరు. చీకటి రాత్రివేళ. చినుకులుకూడా పడుతున్నాయి. ఈ మారుమూల గదిలో ఈ యువతీ యువకులు, వీళ్ళ ప్రవర్తనకు రెండో అర్థంకూడా ఉంటుందనుకున్నంత అమాయకుణ్ణం కాదు నేను.

'అంతదూరంనుంచి యీ సెంటరుకి కట్టి, యిక్కడి కెందుకొచ్చానని ఆశ్చర్యపోతున్నారుకదూ మూర్తిగారూ! ఇంత దూరమేకాదు ప్రపంచం ఆచివరనుంచి యీ చివరికైనా పరిగెత్తుకొస్తాను. మేష్టారి శక్తి అంతటిది — మీకు తెలుసునో, తెలియదో.'

అంది లీల వెలుగులు వెదజల్లుతూ నవ్వుతూ.

ఇలాంటి దౌర్భాగ్యపు పనులు ఎవరి కంటా పడకుండా ఏ మారుమూలో ఉరెట్టుకుంటారు. ఇలాంటి దిక్కుమాలిన వ్యవహారాలు కిక్కురుమనకుండా తగలడతారు. అలాంటిది ఇంతటి వెలుగులో పెద్ద గొంతుకతో ఉపన్యాసాలుకూడా యిస్తోంది. లోకంలో ఎంతటి తెగించినవాళ్ళైనాఉంటారు కాబోలు.

'ఎందుకలా చిత్రంగా చూస్తారు? మేష్టారు పరీక్షకు పంపగా ఫేలయినవాళ్ళ నెవర్నీ యింతవరకూ నేను చూడలేదు. అర్థమయేటట్లు బోధించ గలగడమేకాదు, పరీక్ష రాసేవేళ విద్యార్థుల్లో పరకాయప్రవేశం చెయ్యడం కూడా ఆయనకు తెలుసనుకుంటాను.'

'చూడూ, నీకు నామీద శ్రద్ధ అంటూ ఏర్పడితే అది పరీక్షపేపర్లు ఆన్సరు చెయ్యడంలో చూపించు. ఎందుకు యీ అనవసరపు పొగడ్తలు. మావాడు ఏమైనా అనుకోగలడు!'


అన్నాడు శ్రీనివాసరావు గుప్తంగా గుంభనంగా. వీళ్ళు నాకు చెప్పేదేముంది? 'ఏమైనా అనుకోడం' నేను, ఎప్పుడో జరిగిపోయింది. 'మొహం కడుక్కుని వస్తాను. ఓగంటయినా చదువుకోవాలి. ఇండియన్ హిస్టరీ నాకు డౌటుకూడాను' అంటూ చీర సవరించుకుని ఒంటినిండా కప్పుకుని — ఆ మహాపతివ్రతాతిలకం, లీల, తలుపు దగ్గరకి వచ్చి నిలబడింది. ఆమె నడుస్తూంటే నా గుండెలమీద ఎవరో పతాకస్థాయిలో మద్దెల వాయిస్తున్నట్టు అయింది. ఆమె ఆగి, నావైపు చూసి, నవ్వుతూంటే నా నరాలు తీగెలుగా చేసి ఆఖరిమెట్లమీద అతి త్వరితంగా వీణవాయించిన ట్లయింది.

'మీదగ్గర అగ్గిపెట్టె ఉంటే యిలా పడెయ్యండి మేష్టారూ, కిందకెళ్ళి యింటివాళ్ళ స్టౌ వెలిగించి యింత కాఫీ పెట్టి, తీసుకొస్తాను. అతిథీ అభ్యాగతీ అన్నారు' అంటూ లీలఅతనిదగ్గిర అగ్గిపెట్టె పుచ్చుకుని కిందకి పరుగుతీసింది.

శ్రీనివాసరావు తల అంతవరకూ అతను చదువుతున్న నవలలోనే ఉంది. ఆ పుస్తకం అంత యింట్రస్టింగా ఉందని నటించడం కాబోలు అది.

'ఏమయ్యా మూర్తీ, యివాళ మౌనవ్రతంగాని ధరించావాయేం, నోటమ్మట ఒక్కముక్క ఊడిపడదేం?'

'శ్రీనివాసరావ్. పదిమందికి పాఠాలు



చెప్పగల పాండిత్యం నీది. అందరిచేతా అవుననిపించుకోవలసిన ఆదర్శం నీది. అలాంటిది యింతటి త ప్పుమార్గాన్ని నడవడానికి నీకు బుద్ధెలాపోయింది ? పెళ్ళయి కాపురం చేస్తున్నవాడివి. ఇద్దరు పిల్ల లున్నారు. చదువు వంక పెట్టి విలాసాలు సాగిస్తున్నావా? అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యకి ఎంత ద్రోహం తలబెడుతున్నావో ఊహించావా? పోనీ ఆ అమ్మాయైనా యింకా పెళ్ళికానిదా అనుకుంటే లక్షణంగా ఎక్కడో కాపురం చేసుకుంటున్నది. పచ్చని ఆమె కాపురంలో చిచ్చు పెడతావా ?'

ఇలాగ మొహం వాచేలాగ శ్రీనివాసరావుని చీవాట్లు పెట్టడానికి నాకు అంతకన్న అవకాశంలేదు. కాని చీకూచింతా లేకుండా వాడు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఒళ్లు ఉడికిపోయి, వెర్రి ఆవేశంతో నా నాల్లోమాట నోట్లోనే పిడచగట్టుకుపోయింది. తెల్లని పైజామా, తెల్లని చేతులుగల బనియను, ఎత్తైన గుండెలు, ఎగిరిపడే దండలు. ముప్ఫైయ్యోపడి మీద పడుతున్నా పద్దెనిమిదేళ్ళ కుర్రాడిలా ఎవ్వరడీగా కనపడుతున్నాడు దొంగరాస్కెల్. నేనలా చూస్తుండగా విలాసుందరి కాఫీ తెచ్చి యివ్వనే యిచ్చింది, ఆవిడ రాక ముందు, ఆ దుశ్శీల తెచ్చియిచ్చిన కాఫీ ఎడంచేతి ి టకారుతోకూడా ముట్టుకోకూడదని కృతనిశ్చయుడనై ఉన్నాను. కాని కాఫీ యిస్తున్నప్పుడు ఆమె కొంచెం ముందుకు వంగింది. ఆ గెడ్డమూ, ఆ మెడా, ఆ చేతులూ – అవి ఆమె దేహం మీద కలిగించే నీడలూ చూస్తుంటే మొగజన్మ ఎత్తిన ఎవడైనా ఆమె కాఫీయేకాదు, కాలకూటం యిస్తుందని తెలిసినాసరే, గడగడ తాగెయ్యకమానరు. మీకు తెలీదు, ఆ సందర్భం అలాంటిది. కాఫీ తాగేశాక లేచి నిలబడ్డాను వెళ్ళిపోవానికి.

'అప్పుడే వెడతారా ? ఏమిటో మాట్లాడినట్టేలేదు. అయినా యింత బెల్లంకొట్టిన రాయిని మా మేష్టారు ఎక్కడ పోగుచేశారో, చిత్రమే...పరీక్ష అయిపోయాక మీ ఇంటికి వచ్చి మీ ఆడవాళ్ళని కలుస్తాను. మిమ్మల్నింత సుఖవుగా ఒదలనండోయ్' అంది ఆమె నవ్వుతూ. ఈ నారీశిరోమణి యిక మాయిల్లు పావనం చెయ్యడం ఒక్కటే తరువాయి. అప్రయత్నంగా లీలాసుందరితో మా ఆవిడ వెంకట్రత్నాన్ని పోల్చుకున్నాను. అందాన్ని కొరుక్కుతినము.

తెలివితేటల్నీ నమిలి మింగెయ్యము.

'నగల్నీ వయ్యారాల్నీ ముక్కముక్కలు చేసి చప్పరించము.

కాని ప్రతిక్షణమూ ప్రతిఒక్కరమూ అరగదీసేది డబ్బు. అందుకనే అర్థం తెచ్చిన ఒక అంగినే నేను ఎంచుకున్నాను.

వెంకట్రత్నం పేర రెండున్నర ఎకరాల పంటకాలువ భూమి వుంది.

వెంకట్రత్నం మెడని రెండువందల తులాల బంగారం ఉంది.

వెంకట్రత్నంకూడా రెండొందల ఏభై పౌనుల శరీరంతోటి ఉంది!

అన్నిటినీ అంకుపతో భరిస్తున్నాను. నా కేంలోటుఅని యిన్నాళ్ళూ అనుకున్నాను. కాని యీనాడు యీ లీలాసుందర్ని చూస్తే? ఛ, యిలాంటి అయోగ్యురాలితో అలాంటి కులస్త్రీని పోల్చడ మేమిటి? మరక్కడ నిలబడ బుద్ధిపుట్టలేదు. గిరుక్కున దిగి కింద కొచ్చేశాను. ఇంటివాళ్ళు సినిమానుంచి వచ్చేస్తుండగా నేను వీధిలోకి వెళ్ళిపోయాను. ఆ వీధి దాటుతూనే ఒక అరుగు కనబడితే అందుమీద చతికిలపడ్డాను. ఎవరో నీతీజాతీలేని వెధవలు చెడిపోతే అర్థముంది. అయినింట పుట్టి, నీతులు బోధించి, పెద్దమనుషులుగా చెలామణీ అవుతున్న వీళ్ళు, ఇంతింత నాటకాలు ఆడుతూంటే, వెంటనే ఏదోవొకటి చేస్తేగాని నా ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకడం తగ్గేలా కనిపించలేదు.

అక్కడక్కడ స్టూడెంట్సు చదువుకుంటున్నారు. నలుగుర్నీ పోగుచేసి వేడెక్కించి మేడెక్కించనా? శ్రీనివాసరావెవరో ఈ ఊరి కుర్రాళ్ళకి సరిగ్గా తెలియదుమరి. లేకపోతే వీడిపని పట్టివుందును. సుశీల మొగుడికి ఫోన్‌చేసి పోలీసురెయిడ్ చేయిస్తేనో? అదంతా పెద్దకేసూ, అల్లరీనూ. ముఖ్యమైన సాక్షిగా నన్ను వేసుకుంటారు. ఆ కోర్టమ్మట తిరగలేక చావాలి–వెధవగొడవ. నావల్ల కాదుబాబూ! మ రేం చెయ్యాలి?

ఇదివరకు ఆ మంచంమీద, ఆ దుప్పటీ లోపల, ఆ సుందరి ఒక్కర్తే ఉంది. ఈ పాటికి ... ?

నా చెవుల్లో వేడిగాలి ప్రవేశించింది. చీకటితోపాటు చినుకులుకూడా ఎక్కువయాయనే గుర్తే నాకులేదు. ఏదో వొకటి చెయ్యాలి. ఇంతటి అన్యాయం జరిగిపోతూంటే కళ్లారా చూసి సహించడానికి నేనంత చేతగాని వాజమ్మని కాకూడదు. ఏం చెయ్యాలి? అరగంటసేపూ కిందా మీదా పడగా మంచి ఆలోచన తేచింది. రాఘవరావుకి, అంటే లీలాసుందరి భర్తకి, వెంటనే ఆకాశరామన్న ఉత్తరం రాసిపడెయ్యాలి. అతని ఎడ్రసు ఆ గదిలో ఆమె సూటుకేసులో చూశాను. బాగా జ్ఞాపకం. వెంటనే తెలియబరచాలి.

కనబడిన రిక్షాను ఆపించి స్టేషనుకు పోనియ్యమన్నాను. అక్కడ పోస్టాఫీసు ఎప్పుడూ తెరిచే ఉంటుందిగద. ఒకళ్ళ దగ్గిర పెన్ అడిగి పుచ్చుకుని, ఎడంచేత్తో నాలుగుముక్కలు రాసేశాను.

'మీ శ్రీమతి పరీక్షలని వంకపెట్టి విశాఖపట్నం వచ్చింది. శ్రీనివాసరావనే ఒక శృంగారపురుషుని ఆధ్వర్యంలో ఆమెచదువు ఎంతబాగా సాగుతున్నదో చూడాలంటే మీరే స్వయంగా రావాలి. క్రింద ఎడ్రసు యిచ్చాను, చూడండి. వస్తున్నానని ముందుగా తెలియబరచకుండా, ఏరాత్రి అయినా పది దాటేక మీరు నేను చెప్పిన గదికి వచ్చి చూస్తే అసలు విషయం తమకే బోధపడగలదు — మీ శ్రేయోభిలాషి'

ఎందుకైనా మంచిదని లేట్‌ఫీ కట్టి, ఎక్స్‌ప్రెస్‌బిళ్ళ అంటించి కవరు పడేస్తేగాని నాప్రాణం తేలికపడలేదు. ఇంటికి నడిచి వస్తున్నాను. కొద్దిదూరం నడిచేనోలేదో నా గుండెలు మళ్ళీ బరువుగా కొట్టుకున్నాయి. మనసంతా మళ్ళీ చీకటి, చికాకు కలిగించే చినుకుల్లాంటి ఆలోచనలు. ఎప్పుడో నాలుగైదురోజుల్లో ఆ రాఘవరావు రావొచ్చు, రాకపోవచ్చు. ఈ లోపున? ఎంత వద్దనుకున్నా మళ్ళీ కళ్ళముందు అదే దృశ్యం. అట్టడుగునుంచి ఆవేదన పుట్టుకొచ్చే దృశ్యం అది.

'ఉండండి, ఇంత కాఫీ పెట్టి తెస్తాను. అతిథీ అభ్యాగతీ అన్నారు' అంది కదూ, లీల? అంటే ఏమిటి దాని కర్థం?

వీళ్ళకి అతిథీ అభ్యాగతీ కావలసి వచ్చారా? ఇదొక సంసారమా? అతిథి వెళ్ళిపోయాక వీళ్ళు నిర్వహించే గృహస్థధర్మం ఏమిటి? మరిరాకుండా గట్టిగా తలుపు బిగించుకోడమేనా? ఇంతఘోరమా? నా నరాలు ఘోషపెట్టేయి. నా రక్తం ఉడుకుపట్టింది. ఎటు నడుస్తున్నానో నాకే తెలీదు.

భుజంమీద ఒక గాజులచెయ్యి పడింది. ఒక్కమాఱు విద్యుత్‌లాంటిది శరీరమంతా ప్రసరించింది. ఆగి, వెనక్కి తిరిగేను.

'పెట్టుపుకి అభ్యంతరం లేకపోతే ఒకపాలి మా ఆతిథ్యం స్వీకరించమని ఈ ఎర్రిదాయి యిగ్గేసన.'

అదొక ఆడది, నేనొక మొగాణ్ణి. క్షణములో నాకు మరేం జ్ఞాపకంలేదు. అరగంట దాటినతరవాతగాని దాని యింట్లోంచి యివతలికి పడినట్టు గుర్తులేదు.

*  *  *

ఆ నాలుగోనాడు కాబోలు, బెజవాడ నుంచి రాఘవరావు వచ్చేడు. ఆ వేళకు అక్కడే ఉండడం నా అదృష్టం. ఇంతటితోనైనా వీళ్ల ఆట కట్టి పోతుందనీ, అటో యిటో తేలిపోతుందనీ ఉవ్విళ్లూరి పోతున్నాను నేను.

'ఎలా రాశావ్ పరీక్షలు?' అంటూ వస్తూనే అడిగాడు.

'చాలా బాగా రాశాను, తప్పకుండా ఫస్టుక్లాసు వస్తుంది. మేష్టారు దగ్గిరుండి చెబితే మరోలా ఎలా జరుగుతుంది?' అంది నవ్వులతో శ్రీనివాసరావుకి నమస్కరిస్తూ.

'మీరు లీల విషయంలో చూపిన ప్రత్యేక శ్రద్ధకు కృతజ్ఞుణ్ణి మేష్టారూ' అని అతని రెండు చేతులూ పట్టుకున్నాడు రాఘవరావు. నేను వెలవెల బోయాను. నా ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది. నా ఉత్తరం అంది రాలేదా రాఘవరావు?


'వెధవ పరీక్షలు! పది రోజులపాటు

పరాయి ఊళ్లో మిమ్మల్ని వదలి ఉండడం ఎంత కష్టమయిందో!' ఇద్దరం పై మొగాళ్లం అక్కడ ఉండగానే భర్తపై ప్రేమ ఒలకబోస్తోంది. ఎంత నటకురాలు!

'రేపు నువ్వెలాగా వచ్చేస్తావ్. నేను రావలసిన పనేమీలేదు. కాని...' అతను అనుమానంగా నా వైపు చూశాడు. నా గుండె స్పీడు హెచ్చింది. 'మనకి కావలసిన వాడే. చెప్పండి. మరేం ఫరవాలేదు' అన్నాడు శ్రీనివాసరావు. రాఘవరావు జేబులోంచి నా ఉత్తరం తీసి మాకు ముగ్గురికీ మాత్రమే వినపడేలా చదివేడు; నాకు ముచ్చెమటలు పోశాయి. 'దీనికోసం రాలేదనుకుమా, నేను! ఆ సంగతి నీకు చెప్పక్కర్లేదు కూడా. నిన్నేవరేం చిక్కులు పెట్టేరో అని వెంటనే బయలుదేరి వచ్చేశాను. ఈ కాలంలో కూడ యింతింత వెర్రివెధవలు ఉండడం ఆశ్చర్య కరం. ఆడదానికి గాని మొగవాడికి గాని ఎవరినీతి వాళ్ళకుండాలిగాని చెడిపోయే అవ కాశాలకోసం ఊళ్ళు దాటి రావాలా?'

లీలాసుందరి బుగ్గని చెయ్యి పెట్టుకుని ఆలోచిస్తూ అలా ఉండిపోయింది. చూస్తూం డగా ఆమె కళ్ళలో నీళ్ళు తిరి[గా]యి.

'ఇంత పిల్లనై పరికిణీ జాకెట్టూ కట్టు కునే రోజుల్నుంచీ, అంటే సెకండుఫారం చదువుతున్న నాటినుంచీ మేష్టార్ని ఎరు గుదును. ఫిఫ్తుఫారం చదువుతూండగా పెళ్లై మీతో వచ్చేశాను. మెట్రిక్ పూర్తిచేద్దామని అనుకుంటూ అలా అలా అశ్రద్ధ చేసేశాను. అప్పటికి అవకాశం లభించి మళ్ళీ పరీక్షకి కూచున్నాను. ఆయన ముందు యింకా చిన్నపిల్ల నైనట్టే చనువుగా ఉంటుంది నాకు. ఇలాంటి అపవిత్రమైన సంబంధం అంటకట్టడానికి ఏ పాపిష్టి వాడికి చేతు లొచ్చాయో! ఎవడంటారు యింతకు



తలపెట్టింది?' అంది లీలాసుందరి నావైపు చూస్తూ. పచ్చివెలక్కాయ గొంతుకలో పడినట్లు అయింది నాకు. ఎలాగో కూడదీసు కుని అన్నాను:

'ఇంకెవరు? ఇంటివాళ్లు ఐఉంటారు.'

'ఎంతమాత్రం కాదు. వాళ్ళకు బాగా తెలుసు.'

'ఎలా?'

'నేనూ, మహాలక్ష్మిగారూ ప్రతిరోజూ హాల్లో పడుకునేవాళ్ళం.'

శ్రీనివాసరావుకి ఆ సంభాషణ పొడి గించడం అట్టే నచ్చినట్టులేదు. 'పోనిద్దూ, ఎవరేమనుకుంటే ఏం పోయింది? ఇంత సహృదయుడూ, సంస్కారవంతుడూ అయిన భర్త లభించిన తరువాత ఎవ రేం రాసినా, కూసినా ఏమిటి ప్రయోజనం? చిత్రమైన యీ లోకంలో ఎవ రేమన్నా చిన్నబుచ్చుకోని చిత్తస్థయిర్యాలు కలిగి ఉండడం ఎంతయినా అవసరం. ఏమం టారు?' అన్నాడు.

'పదండి సెకండ్ షోకి ఏదయినా సినీమాకి పోదాం. మళ్ళీ తెల్లారితే ప్రయాణం' అన్నాడు రాఘవరావు. ఎంత బలవంతపెట్టినా నాకుమాత్రం వెళ్ళడానికి మనస్కరించలేదు. వాళ్ళు వెళ్ళిపోయాక ఎంతో ఆశాభంగం పొందినట్టూ, అవ మానం చెందినట్టూ కొద్దిసేపు బాధపడ్డాను. అంతలో మళ్ళీ తేరుకున్నాను. ఇంతకీ ఏమయిందని? ఒక మంచి పనికోసం మనస్సా పనిచేశాను. పాడులోకం అర్థం చేసుకోలేదు. దానికి అనవసరంగా నేను బాధ పడడం దేనికి? ఇలాంటివాళ్ళుండ బట్టే లోకం ఇంతగా చెడిపోయింది. మండిపోతున్నాయి ధరలు అంటారు. పొరపాటు. మండిపోతున్నది ధర–పూర్తిగా. ఇదిగో యిలాంటి నీతిలేనివాళ్ళ వల్లనే. ✱